## క్లుప్తంగా

### వారోత్సవాలు ప్రారంభం



గంగదేవి విగ్రహాన్ని ఊరేగిస్తున్న జాలర్లు

**వేమనపల్లి:** మండల కేంద్రంలోని బెస్తవాడలో జాలర్ల కుటుంబాల ఆధ్వర్యంలో గంగదేవి వారోత్సవాలను ప్రారంభించారు. అర్చకుడు సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం గంగదేవి విగ్రహంతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వారం రోజులు చేపల వేటకు వెళ్లకుండా నియమనిష్ఠలతో నవరాత్రులు జరుపుకోనున్నట్లు తెలిపారు. పూజలు, గంగాదేవి ఒగ్గుకథ గానం ఉంటుందన్నారు.

### భవన నిర్మాణానికి విరాళం



వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న నాయకులు

**లక్సెట్టిపేట:** మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఐక్య వ్యాపార సంఘం భవనానికి పట్టణానికి చెందిన ఐక్య వ్యాపార సంఘం అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వర్లు రూ. ఎనిమిది లక్షల పదకొండు వేలు విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం దాతను శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వ్యాపారస్తులు సుధాకర్, మహేందర్, శ్రీనివాస్, సురేష్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ పట్టణ ప్రచార కార్యదర్శిగా నరేశ్

**శ్రీరాంపూర్:** నస్పూర్ పట్టణ బీఆర్ఎస్ పట్టణ ప్రచార కార్యదర్శిగా పెట్టం నరేశ్‌ను నియమించారు. ఈ మేరకు ఎమ్మెల్యే దివాకర్‌రావు గురువారం నరేశ్‌కు నియామకపత్రం అందించారు. పార్టీలో క్రియాశీలకంగా పని చేయడంతో ఆయనకు ఈ పదవిని కట్టబెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, మాజీ సర్పంచ్ మల్లెత్తుల రాజేంద్రపాణి, మాజీ ఎంపీటీసీ వేల్పుల రవీందర్, నాయకులు కొండపర్తి శంకర్, సిద్ధం శంకర్, కుమ్మం రాజేశ్వర్‌రెడ్డి, అయిత రాజు, సాగే ఉపేందర్ పాల్గొన్నారు.

### 21న గురుకులాల పేరెంట్స్ కమిటీల ఎన్నిక

**మంచిర్యాలటౌన్:** జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్, కస్తూరిబా, గురుకుల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీలను ఈ నెల 21న జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తా మిమ్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు టీజీపీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆజ్మీర సంతోశ్‌నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కమిటీ ఎన్నికలకు జిల్లాలోని అన్ని గురుకులాల విద్యార్థుల తల్లిదండ్రులు ఉదయం 10గంటలకు హాజరుకావాలని కోరారు.

### రాహుల్ సభలో ప్లకార్డుల ప్రదర్శన



ప్రదర్శిస్తున్న నాయకులు

**చెన్నూర్:** చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గ టిక్కెట్ కాంగ్రెస్‌కు కేటాయించాలని పెద్దపల్లిలో జరిగిన రాహుల్ సభలో చెన్నూర్ కాంగ్రెస్ నాయకులు పాతర్ల నాగరాజు, అన్వర్, బొడ్డు రాకేశ్, గడ్డం సుమంత్, తగరం కృష్ణ, తుంగపిండి అనిల్, భీమ్ మధు, దుర్గ ప్రసాద్, రవీందర్ ప్లకార్డులను ప్రదర్శించారు.

### కొనసాగుతున్న ఓపెన్ పరీక్షలు

**మంచిర్యాలఅర్బన్:** ఓపెన్ స్కూల్ ఇంటర్, పదోతరగతి పరీక్షలు గురువారం కొనసాగాయి. పదోతరగతి పరీక్షలకు 53మందికి గాను 38మంది విద్యార్థులు హాజరుకాగా 15మంది గైర్హాజరయ్యారు. ఇంటర్‌లో 32మంది విద్యార్థులకు గాను 23మంది విద్యార్థులు హాజరుకాగా 09మంది గైర్హాజరయ్యారని డీఈవో యాదయ్య తెలిపారు.

### మందుబాబులకు అడ్డాగా మార్కెట్ యార్డు గోదాం!



**దండేపల్లి:** మండలంలోని లింగాపూర్ మార్కెట్‌యార్డు గోదాం ఆవరణ మందు బాబులకు అడ్డాగా మారింది. పగలు, రాత్రి తేడా లేకుండా లోపలి గోదాం వద్ద మందుబాబులు దర్జాగా మందు తాగుతున్నట్లు సమాచారం. గోదాం ఆవరణల్లో ఖాళీ మద్యం బాటిళ్లు దర్శనిమిస్తున్నాయి.

# వర్షం కోసం ఎదురుచూపు

- తడి లేక కాయదశకు చేరుకోని పత్తి
- రాలుతున్న గూడ, ఎదగని కాయలు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు



సుబ్బరాంపల్లిలో ఆయిల్ ఇంజన్ వద్ద రైతులు



అక్కెపల్లి సమీపంలో వాడిపోయిన పత్తి చేను

**చెన్నూర్‌రూరల్:** ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏటా రైతన్న నష్టపోతూనే ఉన్నాడు. జిల్లా వ్యాప్తంగా వానాకాలంలో వరి1.52లక్షల ఎకరాల్లో, పత్తి 1.64లక్షల ఎకరాల్లో, మిర్చి 6వేల ఎకరాల్లో సాగు చేశారు. అంగ్రాజ్‌పల్లి, ఎర్రగుంటపల్లి, లింగంపల్లి, కాంబోజీపేట, అక్కెపల్లి, చింతలపల్లి, కిష్టంపేట, నాగాపూర్, సుందరసాల, చాకెపల్లి, పొన్నారం, ఆస్నాద, సోమనపల్లి, పొక్కూరు, నారాయణపూర్, సుబ్బరాంపల్లి తదితర గ్రామాల్లో రైతులు ఎక్కువగా పత్తి పంటను సాగు చేస్తున్నారు. రైతులు పంటసాగు చేసేందుకు గాను ఎకరానికి రూ.20వేల నుంచి రూ.50వేల వరకు పెట్టుబడులు పెట్టారు. పత్తి గింజలు పెట్టినప్పటి నుంచి పూతదశ వరకు వర్షాలు విస్తారంగా కురిశాయి. ప్రస్తుతం కొన్ని చోట్ల పత్తి పూత, గూడ దశలో మరికొన్ని చోట్ల కాయ దశలో ఉన్నాయి. నెల రోజుల నుంచి పత్తికి నీరు లేక మొక్కలు వాలిపోతున్నాయి. దీంతో గూడ దశలో ఉన్న మొక్కలకు కాయలు సరిగ్గా పడుతాయా లేదా అని, కాయ పెరుగుతుందా లేదో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్నిచోట్ల బోరు బావులు ఉన్న రైతులు పత్తి మొక్కలకు నీరందిస్తున్నారు. కుంటలు, కాలువల్లో నీరు ఉన్న చోట విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో రైతులు ఆయిల్ ఇంజన్లను గంటకు రూ.600 నుంచి వెయ్యి వరకు చెల్లించి అద్దెకు తీసుకొచ్చి నీరందిస్తున్నారు. ఇక వర్షంపై ఆధారపడ్డ చోట మాత్రం రైతులు చేసేది ఏమీ లేదంటున్నారు. అసలు సమయంలోనే వర్షం కురవని కారణంగా పత్తి దిగుబడులు తగ్గి పోయే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.

#### వర్షం కురిస్తే మేలు..



పత్తి గింజలు పెట్టినప్పటి నుంచి మొక్కలు ఎదిగే వరకు భారీ వర్షాలు కురిశాయి. ప్రస్తుతం గూడ, కాయ దశలో ఉన్నాయి. తడిలేదు, దీంతో మందులు స్ప్రే చేయలేకపోతున్నాం. ఒక్క వర్షం కురిస్తే పంటలు మెరుగుపడుతాయి.

– రమేష్, రైతు

#### భూమిలో తేమ లేనిదే మందులు స్ప్రే చేయొద్దు..



ప్రస్తుతం పత్తి మొక్కలు బెట్టకు వచ్చి ఉన్నాయి. భూమిలో తేమ లేనిదే మందులు పిచికారీ చేయొద్దు. బోరు బావులు ఉన్న రైతులు నీరు పెట్టిన తరువాత మందులు పిచికారీ చేయాలి. వర్షాధారంపై ఆధారపడ్డ రైతులు 200లీటర్ల నీటిలో 400గ్రాముల నానో యూరియాను కలిపి పిచికారీ చేయాలి. లేదా 19, 19, 19మందును వాడాలి. ఇలా చేస్తే కొంత మేరకు మెరుగు పడుతుంది.

– కవిత, ఏవో, చెన్నూర్

## ప్రలోభాలు తగ్గించేందుకు ప్రత్యేక నిఘా!



దండేపల్లి: గూడెం చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు

**దండేపల్లి:** ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యలను అరికట్టేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందుకోసం మంచిర్యాల నియోజకవర్గంలోని లక్సెట్టిపేట పోలీస్ సర్కిల్ పరిధిలో ప్రత్యేక తనిఖీ బృందాలు ఏర్పాటు చేయడంతో పాటు, మంచిర్యాల–జగిత్యాల జిల్లాల సరిహద్దు ప్రాంతాలైన దండేపల్లి మండలం గూడెం వద్ద, జన్నారం మండలం కలమడుగు వద్ద, మంచిర్యాల–నిర్మల్ జిల్లాల సరిహద్దు ప్రాంతమైన జన్నారం మండలం ఇందన్‌పల్లి వద్ద తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఓటర్లను ప్రలోబ పెట్టేందుకు డబ్బులు, మద్యం, ఇతర కానుకలు వంటి వాటిని తరలించకుండా ఉండేందుకు తనిఖీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. తనిఖీ కేంద్రాల వద్ద 24గంటలు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. లక్సెట్టిపేట సర్కిల్ పరిధిలో 6ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పనిచేస్తున్నాయి. అక్రమ మద్యం, డబ్బులు, కానుకల తరలింపుపై తనిఖీ బృందాలు, తనిఖీ కేంద్రాలు ప్రత్యేక నిఘా పెట్టాయి.

#### ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకే...

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురిచేయకుండా అక్రమ మద్యం, డబ్బు, కానుకలు తరలించకుండా ఉండేందుకు ప్రత్యేక నిఘా పెట్టాం. లక్సెట్టిపేట పోలీస్ సర్కిల్ పరిధిలో మూడు చోట్ల తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి తనిఖీలు ముమ్మరం చేశాం.

– కృష్ణ, సీఐ, లక్సెట్టిపేట

## సమస్యల పరిష్కారానికి కృషి

- మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

**మంచిర్యాలటౌన్:** జిల్లా కేంద్రంలోని అన్ని వార్డుల్లోని సమస్యల పరిష్కారం కోసం కృషి చేశానని, ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని 22వ వార్డు పద్మశాలీ కాలనీలో గురువారం మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వార్డు కౌన్సిలర్ మెరుగు మహేశ్వరిలతో కలిసి ఇంటింటికీ పర్యటించారు. బీఆర్ఎస్ ప్ర భుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటుందన్నారు.

## ఘనంగా నవరాత్రి ఉత్సవాలు



ఆర్కే 6 గనిపై పూజలు చేస్తున్న ఏజెంట్, మేనేజర్



లక్సెట్టిపేట: ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

**శ్రీరాంపూర్:** సింగరేణి గనులపై దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆర్కే 6గనిపై గురువారం మైసమ్మ తల్లి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గా మల్లికార్జున స్వామి కల్యాణాన్ని జరిపించారు. ఏజెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి, మేనేజర్ ఈ తిరుపతి దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, గని రక్షణాధికారి శ్రీనివాస్, సంక్షేమ అధికారి సునీల్ కుమార్, పిట్ ఇంజనీర్ శ్యామ్‌తో పాటు నాయకులు ఇప్ప భూమయ్య, గోల్కొండ లక్ష్మీనారాయణ, సంఘం సదానందం, రామచందర్, మహేశ్, ఏల్పుల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. ఎస్సార్పీ 3, 3ఏ గనిపై మైసమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చండీయాగం నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. గని అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

#### అమ్మవారికి కూరగాయలతో అలంకరణ

**లక్సెట్టిపేట:** మున్సిపాలిటీ పరిధిలోని గోదావరి రోడ్‌లో శ్రీ సాయి గణేష్ భక్త మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అవతారంలో దుర్గాదేవి భక్తులకు ద ర్శనమిచ్చారు. అమ్మవారిని కూరగాయలతో అలంకరించారు. నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో భక్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

## నర్సింగాపూర్‌లో అలాయ్ బలాయ్



మాట్లాడుతున్న రఘునాథ్

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** హాజీపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామంలో దసరా పండుగ సందర్భంగా మండల బీజేపీ ఆధ్వర్యంలో గురువారం అలాయ్ బలాయ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ హాజరై మాట్లాడారు. విజయదశమి పండగ చెడును పారద్రోలి, మంచిని పంచేదని వివరిస్తూ పండగ వేళ ఇలా అలాయ్ బలాయ్‌లో కలవడం బంధాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి తిరుపతి, నాయకుడు స్వామిరెడ్డి, పార్టీ కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## కేంద్రీయ విద్యాలయంలో బతుకమ్మ వేడుకలు



వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

**మంచిర్యాలఅర్బన్:** జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో గురువారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను పెంపొందించేందుకు కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

**తాండూర్:** పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలో పంచాయతీ కార్యదర్శులతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యతను కార్యదర్శులు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. ప్రత్యేకించి ర్యాంపు ఉందా లేదో చూసుకోవాలని తెలిపారు. పోలింగ్ సిబ్బంది ఇక్కట్లు పడకుండా వ్యవహరించాలని మార్గదర్శకం చేశారు. ఎంపీవో సత్యనారాయణ, అసిస్టెంట్ ప్రోగ్రాం అధికారి నందకుమార్, పంచాయతీ కార్యదర్శులు, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.



తాండూర్: మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్



కాసిపేట: పరిశీలిస్తున్న ఎంపీడీవో అలీం

#### పోలింగ్ స్టేషన్ల పరిశీలన

**కాసిపేట:** మండలంలోని పెద్దనపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, సోమగూడెం(కె) ప్రాథమిక పాఠశాల, జిల్లాపరిషత్ హైస్కూల్ కాసిపేట, ముత్యంపల్లి, కాసిపేట గ్రామపంచాయతీ కార్యాలయాల్లోని పోలింగ్ కేంద్రాలను గురువారం ఎంపీడీవో ఎంఏ అలీం పరిశీలించారు. అసెంబ్లీ ఎన్నికలకు సంభందించి పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు పరిశీలించినట్లు తెలిపారు. ఏర్పాట్లపై పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించినట్లు, అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఎంపీడీవో వెంట ఎంపీవో నాగరాజు, పంచాయతీ కార్యదర్శులున్నారు.

### బీఎస్పీలో పలువురి చేరిక

**రామకృష్ణాపూర్:** పట్టణానికి చెందిన పలువురు యువకులు గురువారం బీఎస్పీలో చేరారు. పార్టీలో చేరిన వారికి బీఎస్పీ చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షుడు తుంగపిండి రమేష్ కండువా కప్పి ఆహ్వానించారు.

### ‘ఐకమత్యంతో గెలిపించుకుందాం’

**జన్నారం:** వచ్చే ఎన్నికల్లో గ్రూపులకు తావులేకుండా ఐకమత్యంతో ఉండి అభ్యర్థిని గెలిపించుకుందామని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, మాజీ ఎంపీపీ శంకరయ్య పేర్కొన్నారు. మండలకేంద్రంలో గురువారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకున్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు శుభాష్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మాణిక్యం, నాయకులు సుధాకర్‌నాయక్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

### చర్యలు తీసుకోవాలి

**మంచిర్యాలఅర్బన్:** అగ్నిమాపక నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న ఐటీఐ, విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని జేవీఎస్ ఆధ్వర్యంలో గురువారం అగ్నిమాపక అధికారి దేవేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఫైర్‌సేఫ్టీ పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేవీఎస్ ప్రధాన కార్యదర్శి వంశీ పాల్గొన్నారు.

## ‘కాంగ్రెస్ పార్టీ విజయం కోసం సమాలోచనలు’



సమావేశమైన నాయకులు

**బెల్లంపల్లి:** అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కాంగ్రెస్ శ్రేణులు సమాలోచనలు చేశారు. బెల్లంపల్లిలో పట్టణ, మండల ముఖ్యనాయకులు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ గెలుపుకోసం చేపట్టాల్సిన చర్యల గురించి, ఏ తీరుగా వ్యవహరించాలనే అంశాలపై చర్చించారు. డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు మార్గదర్శకంలో పనిచేయాలని శ్రేణులకు సూచించారు. సమావేశంలో డీసీసీ ప్రధాన కార్యదర్శులు గెల్లి జయరాం, సిలివేరి సత్యనారాయణ, నాయకులు నాతరి స్వామి, తొంగల మల్లేష్, కంకటి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, బాకం మల్లేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.



## బంతి సాగు.. భలే బాగు

- లాభాలు అర్జిస్తున్న యువరైతులు

**జైపూర్:** యువ రైతులు వినూత్న వ్యవసాయంపై దృష్టి పెట్టారు. తెలంగాణ ప్రాంతంలో ఆడబిడ్డలు వైభవంగా జరుపుకునే సద్దుల బతుకమ్మ పండుగకు ముందుగా పూలు అందించేందుకు ప్రణాళికగా పువ్వుల సాగుపై దృష్టి పెట్టారు. లాభాలు ఆర్జిస్తూ రైతులందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. జైపూర్ మండలం వేలాల, పొనూర్ గ్రామాల్లో యువరైతులు సుమారు పదెకరాల్లో పూల సాగు చేస్తున్నారు. వారికి ఉన్న భూమిలో కొంతమేరకు వరి, పత్తి పంటలు సాగు చేస్తుండగా, కొంత భూమిలో పూల పంట సాగు చేస్తున్నారు. మార్కెట్లో కిలో బంతి పూలకు రూ.100 చొప్పున విక్రయిస్తున్నారు. ఒక్క ఎకరాకు రూ.1లక్ష నుంచి రూ.1లక్ష 50వేలకు వరకు ఆదాయం వస్తుందని రైతులు తెలుపుతున్నారు.

# రోడ్లు ఇలా.. వెళ్లేదెలా..!



భీమిని మండల కేంద్రానికి వెళ్లే రోడ్డు టేకులపల్లి క్రాస్ రోడ్డు నుంచి రాంపూర్ బస్టాండ్ వరకు గుంతలమయంగా ఉండడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. పూర్తిగా ధ్వంసం కావడంతో ఆ దారి గుండా వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– భీమిని



చెన్నూర్‌రూరల్ మండలంలోని దుగ్నెపల్లి గ్రామానికి వెళ్లే దారిలో నక్క చెరువుకట్టపై ఇటీవల బీటీ రోడ్డు వేశారు. కానీ కొద్ది రోజులకే తారు లేచి, గుంతలు పడింది. సంబంధిత అధికారులు పట్టించుకొని గుంతలు పూడ్చివేయాలని ప్రజలు కోరుతున్నారు.

– చెన్నూర్‌రూరల్

### బీఆర్ఎస్‌లో చేరిక

**మంచిర్యాలరూరల్ (హాజీపూర్):** హాజీపూర్ మండలంలోని కర్ణమామిడి, పెద్దంపేట గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు గురువారం ఎమ్మెల్యే దివాకర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సర్పంచ్ మహేందర్, ఎంపీటీసీ వెంకటేశ్, మండలాధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.